

ముగిసిన జూనియర్ ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జూనియర్ ఇంటర్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఆఖరిరోజు రసాయన శాస్త్రం, కామర్స్-1 పరీక్ష జరిగింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా 106 కేంద్రాల్లో 34,303 మంది విద్యార్థులకు 32,448 మంది హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 12631 మంది విద్యార్థులకు 11808 మంది హాజరయ్యారు. 823 మంది గైర్హాజరవ్వగా 93 శాతం హాజరయ్యారు. 11452 మంది జనరల్ విద్యార్థులకు 10929 మంది హాజరయ్యారు. 1179 మంది ఒకేషనల్ విద్యార్థులకు 879 మంది హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 16824 మంది జనరల్ విద్యార్థులకు 16092 మంది, 1073 మంది ఒకేషనల్ విద్యార్థులకు 916 మంది హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లాలో 15 కేంద్రాల్లో 4281 మంది జనరల్ విద్యార్థులకు 4113 మంది, 564 ఒకేషనల్ విద్యార్థులకు 435 మంది హాజరయ్యారు. మొత్తంగా 95 శాతం హాజరు నమోదైంది.

లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుకు పటిష్ట చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పిసి, పిఎన్డిటి) చట్టం పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో చట్టం అమలుతీరుపై సమావేశంలో చర్చించారు. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితర అంశాలను అధికారులతో సమీక్షించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్స్థాయి ప్రోగ్రాం అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఐసిడిఎస్, పోలీస్ శాఖ, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ తనిఖీలు అధికంగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో 96 లింగనిర్ధారణ సెంటర్లకు 96 సెంటర్లు పనిచేస్తున్నాయని, మరో తొమ్మిది దరఖాస్తులు కొత్తగా రిజిస్ట్రేషన్కు వచ్చాయని, వీటిని సమావేశంలో ఆమోదించామన్నారు. స్కానింగ్ సెంటర్ల రెన్యువల్కు 13 దరఖాస్తులకు 12 దరఖాస్తులు ఆమోదించామని, ఒకటి తిరస్కరించామని చెప్పారు. జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా ప్రతి దశలోనూ వైద్య, ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసి, అమలు చేయాలని స్పష్టం చేశారు. మహిళలు గర్భందాల్చిన నాటి నుంచి అవసరమైన అన్ని వైద్య పరీక్షలూ చేయించుకునేలా గ్రామస్థాయిలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ఫీవర్ సర్వేలను పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.ఆశ, డిసిహెచ్ఎస్ ఎవిఆర్.మోహన్, అడిషనల్ ఎస్పి (ఎస్సిబి) ఎన్.సూర్యచంద్రరావు, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్య చక్రవేణి, వైద్యులు పాల్గొన్నారు.

కార్మిక, గిరిజన చట్టాల నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

చలో ఢిల్లీ ప్రచారయాత్రలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో ప్రచార జాతా నిర్వహించారు. ఈ జాతా గడియారం స్తంభం సెంటర్ నుండి ప్రారంభమై దక్షిణపువీధి, చిరంజీవి బస్టాండ్ తమ్మిలేరు అప్పలస్వామి కాలనీ వంగాయగూడెం పడమర వీధి చిట్టిఫలం మీదుగా సాగింది. ప్రచార జాతాను ప్రారంభించిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం చేస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్మికుడికి నెలకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టంలో వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 200 రోజులు పని, రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కౌలు రైతు సంక్షేమానికి సమగ్ర చట్టం తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు, అధ్యక్షులు జగన్నాధరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, కిషోర్, ఆటో యూనియన్ నాయకులు గోపి, అంగన్వాడీ నాయకురాలు రజని, జి.కోటేశ్వరరావు, నాగరాజు, అప్పన్న, వరద వెంకట్రావు, సీతారాం పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్వి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చేపట్టిన ప్రచారయాత్ర మంగళవారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మికుల, వ్యవసాయ కార్మికుల, రైతుల, కౌలురైతుల, ప్రజల సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. రైతు సంఘం నాయకులు బొద్దు రాంబాబు మాట్లాడుతూ రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన రైతు వ్యతిరేక విధానాలతో పంటల ఖర్చులను రైతు ఆత్మహత్యలను రెట్టింపు చేసిందని విమర్శించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.ఫ్లోరియన్ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, వాటిని బీజేపీ ఇచ్చే పద్దతులను రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ను అమ్మెద్దని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎన్కె.సుభాషిణి మాట్లాడుతూ ధరలను అరికట్టాలని, నిత్యావసరాలపై జిఎస్టిని రద్దు చేయాలని కోరారు. అనంతరం డివైఎఫ్ఐ నాయకులు ఎస్.శివకుమార్, బి.సురేష్, రైతు సంఘం నాయకులు సిహెచ్.సత్యనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు నాగమణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైస్మిల్లు వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వంకా దుర్గారావు, ముళ్లపూడి సురేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు షేక్ నూర్జహాన్, శ్రీదేవి, శిరీష జి.బుజ్జమ్మ, పి.మోహనలక్ష్మి, నాగమణి, ఎం.కనకదుర్గ, డి.మరియమ్మ, కె.గంగారత్నం, డి.వరలక్ష్మి, శారద, ప్రభావతి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు డి.జయలక్ష్మి, జగతి, రత్నకుమారి, రాణి, నాయకులు డి.హైమావతి, సింహాచలం పాల్గొన్నారు.



ఏలూరులో ప్రచార జాతాలో మాట్లాడుతున్న డిఎన్వి.ప్రసాద్

బుట్టాయగూడెం: వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు, కౌలు రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ సందర్భంగా చేపట్టిన ప్రచార జీపు జాతా మంగళవారం బుట్టాయగూడెం సెంటర్కు చేరింది. జాతాకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ యాత్రనుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్వి.ప్రసాద్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ పరిపాలన చేస్తుందని విమర్శించారు. రైతు సంఘం జిల్లా నాయకులు బొద్దు రాంబాబు మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. వృత్తిదారులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్కె.సుభాషిణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉడతా వెంకటేష్, చుండ్రు బుజ్జమ్మ, కె.పుష్ప, తెల్లం రామలక్ష్మి, లక్ష్మీ రాధ పాల్గొన్నారు.

టి.నరసాపురం : చలో ఢిల్లీ ప్రచార జాతా మంగళవారం మండలంలోని సీతంపేట, మక్కినవారిగూడెం, కృష్ణాపురం, అల్లూరిసీతారామ రాజునగర్లో సాగింది. ఈ యాత్రలో సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్వి.ప్రసాద్, జిల్లా నాయకులు మొడియం నాగమణి, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ముత్యాలమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చలో ఢిల్లీ ప్రచార జీపుజాతా స్థానిక మార్కెట్ యార్డ్ వద్దకు మంగళవారం చేరుకుంది. జాతాకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్వి.ప్రసాద్, సిఐటియు పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తామా ముత్యాలమ్మ, సివిల్ సప్లయిస్ వర్కర్స్ ముప్పిడి అబ్బులు, దుర్గారావు, గంపల వెంకటేష్, శ్రీను, సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సుభాషిణి పాల్గొన్నారు.


ముసునూరు : చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు పిలుపునిచ్చారు. మండలంలోని ముసునూరులో ప్రచార వాల్పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పిల్లి మురళీ, మేరి సులోచన, సునీత, సుజాత పాల్గొన్నారు.

మినీ గోకులం షెడ్ల బిల్లులు, పశునష్ట పరిహారం చెల్లించండి

ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్కు వినతి

ప్రజాశక్తి - ఏలూరు

పాడి రైతులకు మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు తక్షణం చెల్లించాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబుకు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మినీగోకులం షెడ్ల బిల్లుల బకాయిలు, పశునష్ట పరిహారం పథకం బకాయిలు పాడి రైతులకు తక్షణం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా పాడి రైతులకు మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోవడం అన్యాయమన్నారు. అప్పులు చేసి పాడి పశువులకు షెడ్లు నిర్మించుకున్న పాడి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులకు వడ్డీలు పెరిగిపోయి పాడి పశువుల అమ్ముకుని అప్పులు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మినీ గోకులం షెడ్ల బాధిత రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి వీడి బిల్లుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాడిపశువులు మరణిస్తే రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పశునష్ట పరిహారం పథకం నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. పశు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. జిల్లాలో పాడి రైతులు ఇవ్వాల్సిన పశు నష్టపరిహారం నిధులు రూ.ఎనిమిది కోట్లు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతులను అన్ని విధాలాఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.నెహ్రూబాబు మాట్లాడుతూ మినీ గోకులం షెడ్ల బిల్లుల బకాయిలు, పశు నష్టపరిహారం బకాయిల సమస్యలను ప్రభుత్వం దీష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తమ్మినీడి శ్రీనివాసరావు, టి.దొరబాబు, పలువురు పాడి రైతులు పాల్గొన్నారు.



జెడికి వినతిని అందిస్తున్న నాయకులు

ఐక్య పోరాటాలతో సమస్యలు పరిష్కారం

నిర్వాసితులకు ఎల్లప్పుడూ సిపిఎం అండగా ఉంటుంది - పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - కుక్కునూరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులంతా ఏకమై పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని, పూర్తి ముంపులో ఉన్నా ముంపులో లేవని 45.75 కాంటూరులో చేర్చిన పది గ్రామాలను 41.15 కాంటూర్ మొదటి విడత పరిహారపు జాబితాలో చేర్చడం నిర్వాసితుల పోరాటానికి నిదర్శనమని, నిర్వాసితులకు అండగా ఉంటూ వారి సమస్యలపై సిపిఎం ఎల్లప్పుడూ పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వాసితుల పోరాట ఫలితంగా పూర్తి ముంపులో ఉన్న పది గ్రామాలను 41.15 కాంటూర్లోని మొదటి విడత పరిహారపు జాబితాలోకి చేర్చిన బెస్తగూడెం, మాధవరం గ్రామాల్లోని నిర్వాసితులతో మంగళవారం సిపిఎం బృందం భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, పునరావాసంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజుకో మాట మాట్లాడుతూ పూటకో ప్రకటన చేస్తూ స్పష్టత లేకుండా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను గందరగోళానికి గురిచేస్తున్నారన్నారు. నిర్వాసితులకు 60 శాతం పూర్తి పునరావసం, పరిహారం చెల్లించాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలని చట్టాలు చెబుతున్నా, వాటిని తుంగలో తొక్కి75 శాతం నిర్మాణం పూర్తి చేశామని ప్రభుత్వాలు చెప్పడం దారుణమని విమర్శించారు. జూన్. జులై నెలల్లో వచ్చే గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని 41.15 కంటూరులో గతంలో ఉన్న ఎనిమిది గ్రామాలతో పాటు ప్రస్తుతం చేర్చిన బెస్తగూడెం, మాధవరం, కౌండిన్యముక్తి, ముత్యాలంపాడు, ఎల్లప్పగూడెం, చెరువుకొమ్ముగూడెం, ఎర్రబోరు, గుండంబోరు, ఆంబోతులగూడెం, రావిగూడెం గ్రామాల్లో వెంటనే సర్వే నిర్వహించి, అవార్డు విచారణ పూర్తి చేసి పరిహారం చెల్లించాలని కోరారు. ఆ తర్వాతే పునరావాస కాలనీలకు తరలించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులను ఇక్కడి నుండి తరలించే నాటికే 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు కటాఫ్ తేదీగా ప్రకటించి పరిహారం ఇవ్వాలని, గిరిజనులకు భూమికి భూమిని ఇవ్వాలని, నిర్వాసితకాలనీల్లో ఉపాధి అవకాశాలు, విద్యా, వైద్యం, అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జి.వెంకట్రావు, యర్రంశెట్టి నాగేంద్రరావు, మండల నాయకులు యర్ణం సాయికిరణ్, పట్ల లక్ష్మయ్య, పి.రమేష్, వలీపాషా, దాచారం గ్రామ పంచాయతీ సర్పంచి కంటిపల్లి రామకృష్ణ, నిర్వాసితులు బొల్లి కృష్ణ, కొండమ్మ, కోటి, రామయ్య, రాంబాబు, రామాచారి పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే భూస్వాధీనమే

దోసపాడు భూపోరాట దళితుల హెచ్చరిక - ఐదో రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - దెందులూరు

పేదలకు చెందిన అసైన్డ్, సీలింగ్, గయాళ భూముల కోసం పది నెలల నుండి పోరాడుతున్నప్పటికీ పట్టించుకోని రెవెన్యూ శాఖ అధికారులు, 25 ఏళ్ల నుండి స్థానికేతర భూస్వాములు అక్రమంగా భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నప్పటికీ చట్టపరమైన చర్యలు తీసుకోకుండా మొద్దునిద్రపోతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. దోసపాడు గ్రామ సచివాలయం ముందు పేదలతో కలిసి చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారానికి ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తమ భూములు తమకు అందించాలని పది నెలల నుంచి పోరాటం చేస్తున్నప్పటికీ రెవెన్యూశాఖ అధికారులకు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

ఈ క్రమంలో అక్కడకు వచ్చిన రెవెన్యూ శాఖ అధికారులకు, పేదలకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం అసైన్మెంట్ భూములు ఆక్రమించుకున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలున్నప్పటికీ నేటికీ వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోగా పేదలు భూముల్లోకి వెళ్తే దౌర్జన్యం చేస్తూ దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల భూముల ఆక్రమణదారులపై ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు కట్టినప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కుమ్మక్కై పేదలకు, దళితులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. పేదల భూముల విషయంపై వారం రోజుల్లో రాతపూర్వక హామీ ఇవ్వని పక్షంలో మరోమారు భూముల్లోకి వెళ్లే కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏదైతే చేపల చెరువులున్నాయే వాటికి గండికొట్టి స్వాధీనం చేసుకుంటామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి, మండల రెవెన్యూ శాఖ అధికారులు ఈ సమస్యను పరిష్కరించకుండా నాన్చుతున్నారని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య తీవ్రతరం అయిందని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట నాయకులు ఆనందరావు, మణి, కుమారి, గంగాధర్, వెంకటరమణ, తేరేజమ్మ, లలిత, వినోద్, నాగేంద్ర పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న దళితులు, నాయకులు

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పశ్చిమగోదావరి జిల్లా తణుకు మండలం ముద్దపురం గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అన్నారు. ఈ మేరకు బుట్టాయగూడెం అంబేద్కర్ కాలనీ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రాన్సిస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని తలని తొలగించి చెరువులో పడేయడం దళితులను, అంబేద్కర్ను అవమానించడమేనన్నారు. ఇలాంటి దుర్మార్గ చర్యలను అభ్యుదయవాదులు, ప్రజా ఉద్యమ నాయకులు, దళిత సంఘాలు ఖండించాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి చెరువులో పడేసిన వారిని అరెస్ట్ చేయాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని కఠినంగా శిక్షించాలని ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయని, దళితురాలు హోం మంత్రిగా ఉన్నా దళితులపై దాడులు ఆగట్లేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముద్దపురంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.ఆనంద్, బి.మధు, బి.విజయ్ రాజు కె.శ్రీనివాస్, ఎన్.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

విద్యార్థులు ఇష్టపడి చదవి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంఎల్సి షేక్సాబ్జీ అన్నారు. బిఆర్.అంబేద్కర్ 108 డిగ్రీలు చేశారని, ప్రపంచంలో ఇన్ని డిగ్రీలు ఉన్నవారు లేరని అన్నారు. పట్టణంలో జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనం సమాజంలో పనిచేసేవారిని శ్రామికులుగా గుర్తించాలన్నారు. విద్యార్థులు విలువైన సమయాన్ని కొత్త విషయాలు తెలుసుకోవడానికి కేటాయించాలన్నారు. తల్లితండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలను గౌరవించాలన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతారన్నారు. కుల, మత బేధాలు లేకుండా అందరం ఒక్కటే అనే భావనతో ఉండాలన్నారు. సావిత్రిబాయిపూలే, ఝాన్సీలక్ష్మీబాయి వంటి మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు, సుబ్బరాజు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అప్పారావు, రాష్ట్ర మెంబర్ పూరేటి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు దామోదర్, బాలకృష్ణ, సూజాత పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై రైతుల ఆందోళన

కార్యాలయానికి తాళం వేసిన వైనం



కార్యాలయానికి తాళం వేస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాదంపూడి రైతు సేవా సహకార సంఘానికి రైతులు మంగళవారం తాళాలు వేసి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రైతులు సొసైటీ వద్దకు చేరుకున్నారు. ఈ సొసైటీలో గతంలో పంట, పంటేతర రుణాలు తీసుకుని తిరిగి అప్పులు వడ్డీతో సహా చెల్లించినా బకాయిలు ఉన్నాయంటూ రైతులకు నోటీసులు పంపడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీ సెక్రటరీ, సిబ్బంది కారణంగా గతేడాది సుమారు రూ.2.30 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయి. రైతులు అప్పులు, వడ్డీగా చెల్లించిన సొమ్మును సొసైటీ ఖాతాకు జమచేయకుండా సెక్రటరీ, సిబ్బంది అవినీతికి పాల్పడ్డారంటూ రైతులు ఆరోపించారు. ఈ విషయంపై ఆ శాఖ ఉన్నతాధికారులు ఏడాదికాలంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సొసైటీ ఉద్యోగులు సరైన సమాధానం చెప్పకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు సొసైటీ కార్యాలయానికి తాళాలు వేశారు. కలెక్టర్, ఉన్నతాధికారులు వచ్చేంతవరకూ వదిలేది లేదని భీష్మించుకున్నారు. తమ బకాయిలు పూర్తిగా తీరినట్లు రశీదులు ఇచ్చేంత వరకూ రిలే దీక్షలు చేస్తామన్నారు. చేబ్రోలు పోలీసులు వచ్చి గొడవ జరక్కుండా చర్యలు చేపట్టారు. సొసైటీ సెక్రటరీకి నోటీసు ఇచ్చి స్టేషన్కు పిలిపిస్తామని పోలీసులు తెలిపారు. బాదంపూడి, వెల్లమిల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి సొసైటీలు సహకారం

ప్రజాశక్తి - టి.నరసాపురం

రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నట్లు కె.జగ్గవరం సొసైటీ చైర్పర్సన్ వాసిరెడ్డి మధు అన్నారు. స్థానిక సొసైటీ ఆవరణలో మంగళవారం మహా జనసభను చైర్ పర్సన్ మధు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛైర్మన్ పదవి చేపట్టిన తరువాత సొసైటీ ఆధ్వర్యంలో బంధంచర్ల గ్రామంలో ఎరువుల గోడౌన్, ఆర్ఓ వాటర్ ప్లాంట్, రాజుపోతేపల్లి అడ్డరోడ్డులో పెట్రోల్ బంకును నిర్మించినట్లు తెలిపారు. భవిష్యత్తులో గృహ నిర్మాణానికి, కారు రుణాలు, రైతు నేస్తం, చిరు వ్యాపారులకు సైతం రుణాలు అందించనున్నట్లు తెలిపారు. గుడ్లపల్లి గ్రామంలో ఆర్బికె గోడౌన్, అల్లంచర్ల, రాజుపాలెం పంచాయతీలో ఎరువులు గోడౌన్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల జిల్లా రైతు సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన మధును మాజీ సొసైటీ అధ్యక్షులు వెలిది కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. సంఘ సిఇఒ తనగాల వీరవెంకయ్య సంఘం వార్షిక బడ్జెట్ను సభ ముందుంచారు. ఈ కార్యక్రమంలో పర్సన్ వెంకటేశ్వరరావు, బంధంచర్ల సర్పంచి వెంకటేశ్వరరావు, వంటిపల్లి సుబ్రహ్మణ్యం, వెలిది గంగాధరరావు, పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ డిపాజిట్ దారులకు అన్యాయం జరగదు : చైర్పర్సన్ ముత్తయ్య

సంఘంలో డిపాజిట్దారులకు ఎటువంటి అన్యాయం జరగదని సహకార సంఘం చైర్పర్సన్ దేవరపల్లి ముత్తయ్య అన్నారు. స్థానిక సహకార సంఘ మహజన సభను రైతు రత్న ప్రాంగణంలో చైర్ పర్సన్ దేవరపల్లి ముత్తయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రూ.లక్షల రుణాలు అనర్హులకు ఇచ్చారని, వాటిని ఏ విధంగా వసూలు చేస్తారని కొందరు ప్రశ్నించారు. వాటికి సంబంధించిన ఒక కరపత్రంలో ఉన్న కొన్ని పేర్లను చదివారు. దీంతో తన అప్పు గురించి సమావేశంలో పేరు చదవడంపై ఆగ్రహించిన రైతు 'మీకు సంబంధం ఏమిటి సమావేశంలో అవమానపరుస్తారా' అని రైతు సభాప్రాంగణంలోకి వెళ్లగా రెండు గ్రూపుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో సమావేశం కొంతసేపు రసాభసగా మారింది. దీనిపై స్పందించిన ఛైర్మన్ ఇతర సిబ్బంది వారిని సముదాయించారు. అనంతరం ముత్తయ్య మాట్లాడుతూ తాను రైతు కుటుంబంలో నుంచి వచ్చానని, రైతులకు, డిపాజిట్దారులకు ఎటువంటి అన్యాయం జరగదని చెప్పారు. సంఘంలో ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారని, అప్పటివరకు అందరూ సంయమనం పాటించాలని తెలిపారు. సహకార సంఘంలో సుమారు రూ.60 నుంచి రూ.70కోట్లు రైతుల డిపాజిట్లు ఉన్నాయని కొందరు రైతులు ఆరోపిస్తున్నారని, సంఘంలో డిపాజిట్లు కేవలం రూ.30కోట్ల లోపే ఉన్నాయని, వాటిని ఎవరికీ ఇవ్వలేదని, సంఘం పరిధిలో ఉన్న బిల్డింగ్, వాటర్ ప్లాంట్, మిల్క్ చిల్లింగ్ సెంటర్, ఎస్మార్ట్ వంటి పలు వ్యాపారాలకు వినియోగించినట్లు తెలిపారు. అవకతవకలు జరిగితే అధికారులు తేలుస్తారని ఎవరూ అపోహపడొద్దని చెప్పారు.



సిఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజనులు

బోయ, వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ

సిఎం జగన్ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బోయ, వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చేందుకు వైసిపి ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని నిరసిస్తూ మండలంలోని చంద్రాయగూడెం, కె.అంకంపాలెం గ్రామాల్లోని ఆదివాసీ సంఘాల నాయకులు, గిరిజనులు సిఎం జగన్, పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, గిరిజన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులను ఎస్టి జాబితాలో చేరుస్తామని అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేయడం సరైన పద్ధతి కాదని, ఈ తీర్మానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జీలుగుమిల్లిలో ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల గిరిజనులు అన్ని విధాలుగా నష్టపోతున్నారని, ఇప్పటికీ సమాజానికి వీరి జీవన పరిస్థితులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని, రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులుగానీ, రిజర్వేషన్లు గానీ పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయని, ఈ దోపిడీ సమాజంలో గిరిజనుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. బోయ, వాల్మీకులు మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉన్నారని, ప్రభుత్వం రాష్ట్రంలో 40 లక్షల మంది ఉన్నారని 2017లో అప్పటి ప్రభుత్వం అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని, జాతీయ గణన విభాగ తీర్మానాన్ని పంపగా వాళ్ల తీర్మానాన్ని తిరస్కరించారన్నారు.

మామిడి రైతుల ఆశలపై 'నీళ్లు'

నూజివీడు రూరల్ : నూజివీడు మండల పరిధిలోని యనమదల గ్రామపంచాయతీ శివారు రేగుంట పరిసర ప్రాంతంలోని మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావంతో అకాల వర్షాల కారణంగా మామిడికాయలు పురుగుల బారిన బడి కుళ్లి నేల రాలుతున్నాయని, అంతేకాకుండా వింత తెగుళ్ల వస్తున్నాయని రైతన్నలు వాపోతున్నారు. మిగిలిన కొద్దిపాటి కాయలు కూడా తెగుళ్ల బారిన పడ్డాయని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ఎఆర్‌డిజికె పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెలలో జరిగిన మోడల్ ఎగ్జామ్‌లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులకు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మంగళవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఇలాంటి పరీక్షలు పెట్టడం వల్ల విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను ప్రోత్సహించవచ్చన్నారు. ఈ పోటీలో విజయం సాధించిన విద్యార్థులు మరెన్నో విజయాలు సాధిస్తారన్నారు. విజయాన్ని సాధించుకోలేని విద్యార్థులకు మరో అవకాశం ఉందని, వారు కూడా అభివృద్ధి అవ్వాలని చెప్పారు. ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు నిరంతరం అండగా ఉంటుందన్నారు. విద్యారంగానికి కేటాయించాల్సిన నిధులు రూ.1.67 కోట్లు కేటాయించలేదని, హాస్టల్లలో, పాఠశాలల్లో, ప్రభుత్వ కళాశాలల్లో కనీస సదుపాయాలు లేవన్నారు. సరిపడా నిధులు కేటాయించడానికి విద్యార్థులందరూ ఎస్ఎఫ్ఐతో కలిసి కృషి చేయాలని, ఒక పక్కన అధ్యయనం చేస్తూనే మరో పక్కన మన సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, యుటిఎఫ్ పట్టణ కార్యదర్శి రాజారాం, ఎఆర్‌డిజికె ప్రధానోపాధ్యాయులు ఉజ్వల, ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్ పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులపై గ్రామస్తుల దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లంచర్ల కొత్తగూడెం అటవీ భూముల్లో సర్వే చేపట్టిన ఫారెస్ట్ అధికారులపై గ్రామస్తులు దాడి చేసి కుర్చీలు, టేబుల్ ధ్వంసం చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనపై ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... అల్లంచర్ల అటవీ భూముల కొలతలు ఏలూరు జిల్లా సర్వే అధికారి మహర్షి బాబు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం అధికారి, ఇతర అధికారులతో ఫారెస్ట్ రేంజర్ అధికారి ఎస్‌వికె.కుమార్, వారి సిబ్బందితో చేపట్టారు. దీంతో గ్రామానికి చెందిన కొందరు రెండు వర్గాలుగా విడిపోయి గొడవపడ్డారు. ఆ గొడవలో ఫారెస్ట్ అధికారులపై దాడి చేసి కుర్చీలు, టేబుల్ ధ్వంసం చేసి టెంట్లు కూల్చేసి సర్వే నిర్వహించొద్దన్నారని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు చెప్పారు. దీంతో అల్లంచర్ల అటవీ భూముల్లో వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది.

మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రణాళికా బద్ధంగా మండల అభివృద్ధికి కృషి చేస్తామని జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దారబోయిన లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ అధికారులు అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మండలంలో లో ఓల్టేజి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. జిల్లా పరిషత్ నుంచి రోడ్ల అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జెవి.సుబ్బారావు, మండల అభివృద్ధి అధికారి ఎన్‌టి.స్వామి, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

లేగ దూడలను సంరక్షించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

లేగ దూడల సంరక్షణ పాడి రైతుల బాధ్యత అని పశుగణన కార్యనిర్వహణ అధికారి జేసురత్నం అన్నారు. మండలంలోని దర్భగూడెం పశు వైద్యశాలలో లేగ దూడల ప్రదర్శన, వాటి పెంపకంపై పాడి రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పాడి రైతులకు దూడల సంరక్షణ, వాటి పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం జీలుగుమిల్లి పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ ఎడి.సాయి బుచ్చారావు మాట్లాడుతూ పాడి రైతులకు ఏడాదికి ఒక దూడ పుట్టినట్లయితే రైతుకు లాభసాటిగా ఉంటుందన్నారు. ఆ విధంగా ప్రతి రైతు ఉత్తమ పద్ధతుల్ని పాటించాలన్నారు. పశు వైద్యురాలు డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ నేటి లేగదూడలే రేపటి పాడి పశువులన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 40 దూడలు పాల్గొనగా ఇందులో మొదటి బహుమతి పైడిమాల సత్తిరెడ్డి, రెండో బహుమతి దొంగ మురళి, మూడో బహుమతి కొడెల్లి నాగేశ్వరరావు అందుకున్నారు. పాల్గొన్న ప్రతి దూడకు బహుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్భగూడెం సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు, సర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, కె.సుధారాణి, ఉపసర్పంచి రాఘవరెడ్డి, ప్రకాశం, పశు వైద్య సిబ్బంది అమ్ములు, రాజు, అచ్యుతరావు, భవాని పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా అందజేత

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో వైఎస్ఆర్ అసరా మూడో విడత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మాట్లాడుతూ మండలంలో రూ.4.47 కోట్ల వైఎస్ఆర్ అసరా మూడో విడత చెక్కు రూపంలో సంఘ సభ్యులకు అందించినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న బుట్టాయగూడెం గ్రామ పంచాయతీ సర్పంచి తెల్లం వెంకాయమ్మను ఎంఎల్ఎ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, వైస్ ఎంపిపి జి.మోహన్‌రావు, కుక్కల వరలక్ష్మి, పార్టీ కన్వీనర్ రత్నాజీ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీహరి, తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి, ఎపిడి నాగేశ్వరరావు, ఎపిఎం పద్మావతి పాల్గొన్నారు.

కృష్ణ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కీర్తిశేషులు సూపర్ స్టార్ కృష్ణ కాంస్య విగ్రహం ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానులు కోరారు. ఈ మేరకు ఎంఎల్ఎ ఆళ్ల నానికి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌పెదబాబుకు నగర్ కమిషనర్ వెంకటకృష్ణకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి రూ.20 వేలు వితరణ

ముదినేపల్లి :మండలంలోని సంకర్షణపురం గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రహరిగోడ నిర్మాణం, టైల్స్ ఏర్పాటు నిమిత్తం టిడిపి యువనేత కొడాలి వినోద్ మంగళవారం రూ.20 వేలు వితరణగా ఇచ్చారు. అంబేద్కర్ గ్రామ కమిటీకి గ్రామ సర్పంచి ఎస్.వి.నాగరాజు చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జీవన్, తంబిబాబు, రాకేష్, వినోద్ చక్రవర్తి, నాగభూషణం, పంతగాని సురేష్, సుధీర్ పాల్గొన్నారు.

అక్రమ భవన నిర్మాణం సీజ్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాన్ని సీజ్ చేశామని మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్ తెలిపారు. శేషాద్రినగర్ మున్సిపల్ పార్క్ సమీపంలో నిర్మిస్తున్న భవనానికి మున్సిపల్ అధికారులు మంగళవారం తాళాలు వేసి సీజ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ భవానీప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పట్టణ ప్రణాళిక విభాగం నుంచి సెక్రటరీ రెండు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణ పనులు కొనసాగించినట్లు తెలిపారు. పట్టణ ప్రణాళిక అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడితే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి జగదీశ్వరరావు, సచివాలయ సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

కల్వర్టును ఢీకొన్న కారు

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

216వ జాతీయ రహదారి వెల్లమిల్లి రేవు సమీపంలో కల్వర్టును కారు ఢీకొట్టింది. మంగళవారం రాత్రి తాడేపల్లిగూడెం వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కారు అండర్ టన్నెల్‌పై ఉన్న వంతెన రైలింగ్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మండవల్లిలో పైపులైన్లు ధ్వంసం

తాగునీరు అందక గ్రామస్తుల అవస్థలు

నేరాన్ని గ్రామస్తునిపై నెట్టేందుకు పంచాయతీ కార్యదర్శి యత్నం

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి పంచాయతీ గ్రామస్తుల పట్ల వ్యవహరిస్తున్న తీరు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం అనే చందంగా వ్యవహరిస్తుంది. పైపులైన్లు ధ్వంసం అవడానికి కారణమైన కాంట్రాక్టర్‌ను వదిలేసి ఆ నేరాన్ని సామాన్యుడిపై నెట్టేందుకు ప్రయత్నించింది. దీంతో ఆ సామాన్యుడు బెంబేలెత్తిపోయాడు. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన మండవల్లిలో రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ డ్రెయినేజీ కల్వర్టుల నిర్మాణ పనులను నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నాడు. కల్వర్టులు, డ్రెయినేజీ నిర్మించే క్రమంలో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడంతో పైపులైను ధ్వంసమై గ్రామానికి తాగునీరందని పరిస్థితి నెలకొంది. మండవల్లి ప్రధాన సెంటర్‌లో కాంట్రాక్టర్ డ్రెయినేజీ ఒక క్రమ పద్ధతిలో కాకుండా ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తూ గుంటలను చేసి పూడ్చకుండా వదిలేశారు. దీంతో గ్రామంలోని మురుగునీరు పారేందుకు అవకాశం లేక మురుగునీరు ఆ గుంతల్లోకి చేరుకుని దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో దుర్వాసనతో తన కుటుంబీకులకు వాంతులు అవ్వడంతో చలించిపోయిన గ్రామస్తుడు వ్యాధులు సంభవిస్తాయనే భయంతో గుంతలను పూడ్చి చేశాడు. దీంతో సమాచారం అందుకున్న కార్యదర్శి ఆ వ్యక్తిని నిలదీశారు. గుంటలను పూడిచేటప్పుడు అధికారులకు చెప్పాలని తెలియదా.. నీ వల్ల పైపులు పగిలిపోయి గత పది రోజులుగా ప్రజలకు నీరందడం లేదని గ్రామస్తునిపై ధ్వజమెత్తారు. పైపులైన్లకు అయ్యే ఖర్చులు భరించాలని హుకుం జారీ చేశారు. దీంతో గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడంలో విఫలమై పైపులను ధ్వంసమవ్వడానికి కారణమైన కాంట్రాక్టర్‌ను వదిలేసి సామాన్యుడిపై కార్యదర్శి ధ్వజమెత్తడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి డ్రెయినేజీ కల్వర్టు నిర్మాణ పనుల్లో ప్రజలు, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి శ్రీనివాసరావును వివరణ కోరగా గ్రామస్తుడిని పిలిపించి మాట్లాడిన మాట వాస్తవమేనన్నారు. ఎవరైనా ఇలాంటి పనులు చేయకుండా భయం ఉంటుందని అలా చేసేమే తప్ప మరోలా కాదన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిల్డ్రన్ హోమ్ చిన్నారులకు నిత్యావసర సరుకులు

ఉంగుటూరు : నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాయ్ ఆఫ్ గివింగ్ కార్యక్రమంలో భాగంగా చేబ్రోలులో ఎంవిఎన్.మెమోరియల్ చిల్డ్రన్ హోమ్‌లో పేద విద్యార్థులకు నెలకు సరిపడా వంట సరుకులను, పండ్లు తదితర వాటిని కళాశాల తరపున మంగళవారం అందిం చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఇవ్వడంలో ఉండే ఆనందాన్ని విద్యార్థులకు పరిచయం చేయటంతో పాటుగా సమాజంలో పేదరికంలో ఉన్న ప్రజలకు చేయూతనందిం చాలనే భావన విద్యార్థుల్లో పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని బెస్ట్ ప్రాక్టీస్‌గా కళాశాలలో కొనసాగిస్తు న్నట్లు గా తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు నిర్మల జ్యోతి, కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండా రవి, రసాయన శాస్త్ర విభాగ అధ్యక్షురాలు హెబ్సిబా, చరిత్ర అధ్యాపకులు పి.భాస్కరరావు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఉమాశంకర్, కామర్స్ విభాగ అధ్యాపకులు లావణ్య, మౌనిక, అధ్యాపకులు విద్యార్థులకు వివిధ నిత్యావసర సరుకులను వితరణగా ఇచ్చారు.

తహశీల్దార్‌కు ఉపాధ్యాయ సంఘాల వినతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్సులను ప్రతి నెల మండల కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయంలో తెరవాలనే ప్రభుత్వ నిబంధనలతో ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సదరు ఫిర్యాదు బాక్సులను స్థానిక గ్రామాల్లోని గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో తెరిచేవిధంగా చర్యలు చేపట్టాలని యుటిఎఫ్, ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. ఈ మేరకు ఆగిరిపల్లి తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కృష్ణ, ఎం.జోగిరాజు, ఎస్‌టియు అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, కోశాధికారి, వంశీ వశిష్ట పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'జనంలోకి జనసేన'

పోలవరం :మండలంలోని చేగొండపల్లి, సింగన్నపల్లి గ్రామాల్లో జనసేన మండల అధ్యక్షులు చిన్ని ఆధ్వర్యంలో జనంలోకి జనసేన కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు ప్రజాసమస్యలను అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా చిర్రి బాలరాజు మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. జనసేన పార్టీ అధికారంలోకి వస్తే పునరావస గ్రామ ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కురసం రమేష్, కార్యదర్శి కనుమర్లపూడి నాగేశ్వరరావు, చీకట్ల సాయి కృష్ణమూర్తి, సీతయ్య, తురం రమేష్, సునీల్, మామిడిపల్లి ప్రసాద్, మామిడిపల్లి స్వాతి, నాగు, కురంశెట్టి రవికుమార్, సిద్ధన రామకృష్ణ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - ముసునూరు

పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలకేంద్రమైన ముసునూరులో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ విద్యార్థులు, బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 16 గ్రామాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేసిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం సత్ఫలితాలనిస్తోందని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గురజలో వేణుగోపాలస్వామివారి కళ్యాణ మండపంలో ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాచూరి రాధా, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, సిడిపిఒ ఆనంద్‌బాబు పాల్గొన్నారు.


హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని పులి రాముడుగూడెం గిరిజన ఆశ్రమ బాలుర హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, రెగ్యులర్ హాస్టల్ వార్డెన్‌ని నియమించాలని, మెనూ అమలు చేసే విషయంలో అలసత్వం వహించిన ఇన్‌ఛార్జి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘ రాష్ట్ర అధ్యక్షులు భూషణం, ప్రగతిశీల యువజన సంఘం నాయకులు టి.బాబురావు కోరారు. గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని వారు మంగళవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు భూషణం మాట్లాడుతూ పులి రాముడుగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహంలో 220 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లు, వాటర్‌ట్యాంక్ సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని చెప్పారు. మెనూ క్రమ పద్ధతిలో అమలు చేయడంలేదన్నారు. దీనిపై ప్రశ్నించిన విద్యార్థులను కొట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. 12 గదుల్లో లైట్లు, ఫ్యాన్ల సమస్య ఉందని, వసతి గృహంలో శానిటేషన్ సమస్య ఉందని ఇన్‌ఛార్జి వార్డెన్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. విద్యార్థులు పౌష్టికాహారం లోపంతో అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఐటిడిఎ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే సమస్యలు పునరావృతం అవుతున్నాయన్నారు. ఉన్నత అధికారుల పర్యవేక్షణ నిత్యం ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్‌ఛార్జిపై వార్డెన్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంచినీటి చెరువు రేవును పునరుద్ధరించాలని ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు



ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మంచినీటి చెరువు రేవును పునర్దురించాలని కోరుతూ సిపిఎం భువనపల్లి కమిటీ ఆధ్వర్యంలో భువనపల్లి పంచాయితీ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేసి అనంతరం అక్కడికి వచ్చిన ఎంపిడిఒ పి.ప్రకాష్‌కు, పంచాయతీ సెక్రటరీ విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఎన్.రమణరావు మాట్లాడుతూ భువనపల్లి పంచాయతీ చెరువు తూర్పు వైపున 300 కుటుంబాల సౌకర్యాలు, అవసరాల కోసం మంచినీటి చెరువు రేవును పునరుద్ధరించాలన్నారు. గతంలో ఉన్న మంచినీటి చెరువు రేవును పూడ్చివేశారని, వేసవికాలంలో విద్యుత్ కరెంటు కోతలో పంచాయతీ నుంచి మంచినీరు సరాఫర అందక చెరువులో నుంచి ప్రజలు నీరు తెచ్చుకుంటున్నారన్నారు. మంచినీటి చెరువు రేవును పునరుద్ధరించాలని, గతంలో 40 ఏళ్ల క్రితం వంకాయల వెంకటేశ్వరరావు సాయంతో నిర్మించిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా ఉందని, తాగుబోతుల అడ్డాగా, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని, గ్రామ పంచాయతీ బాధ్యత తీసుకొని, పంచాయతీ అవసరాలు ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన, మిండీ బాపిరాజు, ప్రగడ మణికంఠ పాల్గొన్నారు.

ఆ రోజు మద్యం షాపులు మూసివేయాలి

ప్రజాశక్తి - చాట్రాయి

బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున ఆయనకు నివాళిగా రాష్ట్రంలో ఉన్న మద్యం షాపులకు సెలవు దినంగా ప్రకటించాలని, రాష్ట్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు ప్రభుత్వమే రంగులు వేయించాలని కుల వివక్షత వ్యతిరేక పోరాట కమిటీ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ ఎన్.మురళీమోహన్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆనందం మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను చిన్నచూపు చూస్తున్నారన్నారు. జాతీయ నాయకులకు ఇచ్చే గౌరవం కూడా ఇవ్వటం లేదన్నారు. ఆయన పుట్టినరోజు సెలవు ప్రకటించినా ప్రత్యేకమైన గుర్తింపు ఇవ్వటం లేదన్నారు. ఆయన రాసిన రాజ్యాంగాన్ని అమలు చేసుకుంటూ, పరిపాలన సాగిస్తూ ఆయనకు మాత్రం సరైన గుర్తింపు ఇవ్వకపోవడం చాలా బాధాకర మనారు. ఇప్పటికైనా భారత రాజ్యాంగం పట్ల గౌర వం ఉంటే ఆయనను ప్రపంచ మేధావిగా గుర్తింపు ఇస్తే వచ్చే ఏప్రిల్ 14వ తేదీ ఆయన పుట్టినరోజు లోపు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు రంగులు వేయించి ఆరోజు మద్యం షాపులను నిలుపుదల చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎంపిడిఒ మాట్లాడుతూ ఈ విషయాన్ని సంబంధిత ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కుల వివక్షత వ్యతిరేక పోరాట కమిటీ మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, ఆడిమెల్లి లాజర్, కొమ్ము సుజానరావు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు



ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజల వద్ద నుంచి అపార్ట్‌మెంట్ తరహాలో ఇళ్లను నిర్మిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేశారన్నారు. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.500 మొదలుకొని రూ.25 వేలు, 50 వేలు, రూ.లక్ష చొప్పున డబ్బులు కట్టించుకున్నారని తెలిపారు. ఇప్పటికీ ఐదు సంవత్సరాలు గడుస్తున్నా వారికి ఇళ్లు అప్పగించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. తెలుగుదేశం హయాంలో నిర్మించారని రాజకీయ దురుద్దేశంతో వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఇళ్లు ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. టిడిపిలో రాజకీయంగా విభేదాలు ఉంటే ప్రజల్ని ఎందుకు నష్టపరచాలని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే లబ్ధిదారులకు గృహాలు స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం నగర కార్యదర్శి పల్లెం కిషోర్ మాట్లాడుతూ నగరంలో టిడ్కో గృహాలకు 18,676 మంది లబ్ధిదారుల వద్ద నుంచి రూ.22 కోట్లు వసూలు చేశారని తెలిపారు. ఈ డబ్బులు మొత్తం ఏలూరు మున్సిపల్ కమిషనర్ పేరుతో డిపాజిట్ కట్టించుకున్నారని గుర్తు చేశారు. డబ్బులు కట్టి ఇప్పటివరకు ఐదేళ్లు అవుతున్నా కట్టిన డబ్బులు ఇవ్వలేదు ఇల్లు అందించలేదన్నారు. గత ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి తాము అధికారంలోకి వస్తే టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఉచితంగా అందిస్తామని, వారు కట్టిన డబ్బులను సైతం వెనక్కి తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం లబ్ధిదారులకు గృహాలు స్వాధీనం చేయాలని, లేకపోతే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. లబ్ధిదారులందరూ తమ వ్యక్తిగత దరఖాస్తులను ఏలూరు మున్సిపల్ కమిషనర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.ఆదిశేషు బి.జగన్నాధరావు, జె.గోపి, ఎం.ఇస్సాకు, కోటేశ్వరరావు, మీసాల సత్యం, ప్రభు పాల్గొన్నారు.


అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు.. ప్రజల అవస్థలు

పారుదల లేక నిలిచిన నీరు

రోడ్లు జలమయం

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి



రోడ్డు పైనేనిలిచిన వర్షపు నీరు

మండల కేంద్రమైన ముదినేపల్లిలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామం యావత్తు జలమయమైంది. దీంతో వర్షపు నీరు బయటకు వెళ్లే అవకాశం లేక ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ముదినేపల్లిలో జరుగుతున్న 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ సెంటర్ చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా చేయడమే ఇందుకు కారణమని ప్రజలు చెబుతున్నారు. గత నవంబర్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తొలుత కాంట్రాక్టర్ ముదినేపల్లి సెంటర్‌లో డ్రెయినేజీల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఉత్తరం వైపు డ్రెయిన్, దక్షిణం వైపు ఉన్న రెండు పాత డ్రెయిన్‌లను పూడ్చి, రెండు వైపుల చిన్న చిన్న ముక్కలుగా కొద్దిగా డ్రెయిన్ నిర్మాణం చేసి వదిలేశారు. పాత రెండు డ్రెయిన్లను బండరాళ్లతో పూడ్చివేశారు. నాలుగు నెలలుగా డ్రెయినేజీ పనులు ఏమాత్రం కాంట్రాక్టర్ చేయడంలేదు. దీంతో గ్రామంలోని వాడుక నీరు బయటకు పోయేందుకు మార్గంలేక ఇళ్ల ముందు ఉన్న డ్రెయిన్లలో దుర్వాసన వస్తోంది. దీనికి తోడు వారం రోజులుగా ముదినేపల్లిలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా డ్రెయిన్‌లో నీరు రోడ్లపైకి చేరడంతో పాదచారులు కూడా నడిచే అవకాశం లేకుండా పోయింది. దీంతో నిల్వ మురుగునీటి దుర్వాసనతో గ్రామంలో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలపై దాడి చేయడంతో ప్రజలు విషజ్వరాలు బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు నేషనల్ హైవే అధికారుల, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌బిఐ బస్టాండ్, ఆర్‌సిఎం చర్చి వద్ద మూడు చోట్ల మూడు ముక్కలుగా డ్రెయిన్ల నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలివేశారు. కాంట్రాక్టర్ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టి నాలుగు నెలలు పైబడిన సకాలంలో నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలు పడుతున్న ఇక్కట్ల నుంచి విముక్తి కలిగించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

జగనన్న కాలనీలో నూతన బోరు ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

జగనన్న లే అవుట్ల వద్ద మంచినీటి సమస్య లేకుండా రూ.4.50 లక్షలతో నూతన బోరు వేయించనున్నట్లు యండపల్లి సర్పంచి యడ్ల మోహన్‌రావు అన్నారు. మండలంలోని యండపల్లి పంచాయతీలో జగనన్న కాలనీ దగ్గర కొత్త బోరును ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా బోరు వేయించామని తెలిపారు. జగనన్న ఇళ్ల నిర్మాణలు త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి ప్రసాద్, వైసిపి నాయకులు మోరంపూడి శ్రీనివాస్, తాటిపర్తి గోపాలరావు, కొత్తూరి శివ పాల్గొన్నారు.

వృద్ధులకు చిన్నారుల సాయం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తుక్కులూరు జెబిఎల్ హోం వృద్ధాశ్రమంలో చిన్నారులకు మంగళవారం వితరణ అందించారు. పట్టణంలోని కుమార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెల్పింగ్ హ్యాండ్స్ చిన్నారులు వృద్ధాశ్రమానికి 50 కిలోల బియ్యం, 15 కిలోల కందిపప్పు, 200 బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు అందించారు. జెబిఎల్ నిర్వాహకులు చిన్నారులను అభినందించారు.

గుండెపోటుతో విఆర్ఒ మృతి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు మండలం కొవ్వలి గ్రామానికి చెందిన ప్రస్తుత మల్కాపురం (పాలగూడెం) విఆర్ఒ మురళి మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పట్టిసీమ ఫెర్రీ వేలం వాయిదా

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమ ఫెర్రీ రేవు వేలంపాట వాయిదా వేయనున్నట్లు పట్టిసీమ పంచాయతీ సెక్రటరీ తాతి విజయ కుమారి తెలిపారు. పంచాయతీ ఆవరణలో 2023-24 సంవత్సరానికి ఫెర్రీ రేవు పాట, వాహనాలు స్టాండ్ పాట, ట్యాంక్ కూల్చివేయగా వచ్చిన పాత ఇనుము, పాత రిక్షాలు, పాత లైట్లకు సంబంధించి బహిరంగ వేలం పాటను పంచాయతీ సర్పంచి సబ్బారాపు శ్రీరామమూర్తి అధ్యక్షతన ఇఒపిఆర్‌డి నిఖిల్ మధు శరన్ పర్యవేక్షణలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాస్‌బాబు సమక్షంలో సెక్రటరీ తాతి విజయకుమారి మంగళవారం వేలం పాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ కుమారి మాట్లాడుతూ ఫెర్రీ రేవుకు సంబంధించి వేలంపాటకు పాటదారులు రాకపోవడంతో ఏప్రిల్ 11వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. పాటలో పాల్గొనేవారు సంబంధిత పత్రాలతో పాల్గొనాలని కోరారు. ఇతర వివరాల కోసం పంచాయతీ కార్యాలయంలో సంప్రదించలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ యు.రాజారావు, సొసైటీ అధ్యక్షులు పాదం రాజబాబు, టి.సూర్యచంద్రం, ఆకుల బుజ్జిలు, గ్రామస్తులు, వెల్ఫేర్ అసిస్టెంట్ నందిని, ఇంజినీరింగ్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్, డిజిటల్ అసిస్టెంట్ సత్య ప్రకాష్, గుమస్తా పోసిబాబు, పంచాయతీ వార్డు మెంబర్లు, సచివాలయం సిబ్బంది, పలు ప్రాంతాల నుంచి పాటదారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తణుకు ఫస్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 824/2022

Between:
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వేల్పూరు
Rep. by its బ్రాంచి మేనేజర్ -వాది
మరియు
1. అబ్బరాజు మహేష్
2. జున్నూరి నాగ రుక్మిణి -ప్రతివాదులు

To:
1. అబ్బరాజు మహేష్, S/o. రామశేషు, పురుషుడు, 39 సం॥లు, డో.నెం. 34-9-15/8, సాయికృష్ణ అపార్టుమెంటు, ప్లాటు నెం.104, బ్యాంక్ కాలనీ, గుఱజాడ స్కూలు దగ్గర, తణుకు.
2. జున్నూరి నాగ రుక్మిణి, భర్త: బాలాజి, స్త్రీ, 55 సం॥లు, డో.నెం. 39-9-15, సాయికృష్ణ అపార్టుమెంటు, ప్లాటు నెం.104, బ్యాంక్ కాలనీ, గుఱజాడ స్కూలు దగ్గర, తణుకు, తణుకు (మం).

వాది తరపున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా 1, 2 ప్రతివాద్లుకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీకు సమన్లు కోర్టు ద్వారా పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **దీ. 31-03-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షంలో దావా విచారణ చేసి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కామన మునిస్వామి
అడ్వకేటు, తణుకు
సెల్: 9441447403

తణుకు
ది.27-03-2023